


# స్వాగతం

సెప్టంబరు నెల వచ్చేసింది. హైదరాబాదులో వినాయక చవితి ఉత్సవాల్ని చూడాలి. ఉత్సవాలకు ఆర్నెల్ల ముందునుంచే వినాయక విగ్రహాలను అచ్చేసి, వాటికి రంగులేసే పిల్లల్ని చూడాలి.

3-4 అంతస్తుల ఎత్తుండే వినాయక విగ్రహాల్ని, క్రేన్లలోఎత్తి చెరువులోవేసే దృశ్యాన్ని వీక్షించాలి. నిమజ్జనం తరువాత నెల రోజులవరకూ హుస్సేన్ సాగర్ చెరువులో మునిగి, అక్కడి ఇనుప చువ్వల్ని సేకరించి అమ్ముకొనే పిల్లల్ని గురించి ఆలోచించాలి.

అన్ని విగ్రహాల్లోని మట్టితో ఆ చెరువు పూడిపోతుంటే అలా కాకూడదని కార్పొరేషన్ వాళ్ళు ప్రతీ ఏడాదీ చేపట్టే పూడికతీత కార్యక్రమాన్ని చూడాలి. ఆ విగ్రహాలకు వాడే రంగుల కారణంగా చెరువు నీళ్ళలో సీసం, పాదరసం మొదలైన ప్రమాదకర రసాయనాలు మోతాదుకుమించి కనబడుతున్నాయని కంగారు పడుతున్న మేధావుల పలుకుల్ని వినాలి.


ఒకవైపున వినాయక చవితి ఊరేగింపులూ, మరోవైపు పవిత్ర రంజాన్ఉపవాసాల నమాజులు - "ఇవి రెండూ ప్రశాంతంగా గడచిపోతే చాలుదేవుడా " అని ప్రార్థించేవారి సంఖ్య ఎక్కువౌతుండటం గమనించాలి. వీటిని రెండింటినీ స్వార్థానికి వాడుకొనేదెలాగో బాగా తెలుసుకొన్న రాజకీయజ్ఞుల పాచికల్ని అర్థం చేసుకోవాలి.

పండుగలు చాలామంచివి. భక్తిశ్రద్ధలకు అవి ఆలవాలాలు. సంస్కృతీ, సహజీవనాలకవి పట్టుగొమ్మలు. వ్యక్తిజీవనానికీ, సంస్కృతికీ పండుగలు కేంద్రబిందువులే, సందేహంలేదు. అయితే యాంత్రీకరణ, పర్యావరణ కాలుష్యం, పెరిగిపోతున్న పట్టణ జనాభాల నేపథ్యంలోంచి చూసి, 'ఈ పండుగల్ని ఇలాగే ఎందుకు జరుపుకోవాల'ని అందరూ ఆలోచించగలిగితే బాగుండు. ఇవన్నీ వేరేగా జరిగితే బాగుండు. నియాన్ బల్బుల ధగధగలూ, పోటీ బాజాలూ, ధనస్వామ్యపు ఊరేగింపులూ కాక భక్తిశ్రద్ధల వ్యక్తీకరణకు మరింత పవిత్రమైన మార్గాలు దొరికితే బాగుండు. తళుకుబెళుకుల్లో పట్టణాలు తమనితాము మరిచిపోకుండా ఒక్క క్షణం ఆలోచిస్తే చాలేమో....నిక్కమైన మంచి నీలాలు లభించక పోవు. కొత్తపల్లెలు తిరిగి జనించకపోవు.

# కూరగాయల కథలు

*పిల్లల కథల్లో కాయగూరల్ని జొప్పించి చెప్పే కథలు చాలా పేరుగాంచాయి. కొన్ని కొన్ని ప్రాంతీయ భేదాలతో ఈ కథలు దాదాపు ఒకే రకంగా వినిపిస్తుంటాయి. ఈసారి మాకు వీటి వెనకపడి వీలైనన్నింటిని సేకరించాలనిపించింది. అలా సేకరించిన వాటిలో మచ్చుకు ఓ మూడు కథలు- మీకోసం. మూడూ చదవండి, 'మీరు విన్న కథలకూ వీటికీ ఏమేం తేడాలున్నాయి, ఏవి బాగున్నాయి' అని ఆలోచించి చెప్పండి.*

### పవన్ కుమార్, మదర్ థెరిస్సా బాలల సంఘం, కొత్తగేరి చెప్పిన బెండకాయంత బ్రాహ్మణుని కథ:




అనగనగా ఒక ఊరిలో బెండకాయంత బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆ బెండకాయంత బ్రాహ్మణునికి, ఇటుకంత ఇల్లు వుండేది. ఒక రోజు బ్రాహ్మణుడికి వంకాయంత వజ్రం దొరికింది. ఆ వంకాయంత వజ్రాన్ని, బీరకాయంత బీరువాలో పెట్టి, తాటికాయంత తాళం వేసినాడు. ఇది కిటికిలోంచి ఒక దొంగ చూసాడు. ఆ రాత్రి బ్రాహ్మణుడు నిద్రపోవటం చూసి దోసకాయంత దొంగోడు, తాటికాయంత తాళాన్ని పగలగొట్టి, వంకాయంత వజ్రాన్ని తీసుకుని, కాకరకాయంత కారులో పారిపోయాడు. పొద్దున్నే, యజమాని వజ్రం లేకపోవటం చూసి, పొట్లకాయంత పోలీసు వద్దకు పోయి, రిపోర్ట్ చేశాడు. ఆ పొట్లకాయంత పోలీసు, జీడికాయంత జీపులో వెళ్ళి , కాకరకాయంత కారులోని, దోసకాయంత దొంగోన్ని పట్టుకుని, జామకాయంత జైల్లో పెట్టి, లవంగమంత లాటీతో కొట్టి, వంకాయంత వజ్రాన్ని, బెండకాయంత బ్రాహ్మణునికి ఇప్పించాడు!! ఎలా ఉంది?

***


### బ్రహ్మేంద్ర, 7వ తరగతి, టింబక్టు బడి, చెన్నే కొత్తపల్లి చెప్పిన చింతకాయంత చిన్నోని కథ:




ఉసిరికాయంత ఊళ్ళో చింతకాయంత చిన్నోడు, పెసరగింజంత పెళ్ళాంతో, కాపురం చేసేవాడు. వారికి ఎలక్కాయంత ఎద్దులు ఉండేవి. ఒకరోజు, శనక్కాయంత చేన్లో దున్నుతుంటే, వారికి వంకాయంత వజ్రం దొరికింది. వారు సంతోషంతో ఆ వజ్రాన్ని బీరకాయంత బీరువాలో దాచారు. అది దోసకాయంత దొంగోడు చూసాడు. దాన్ని ఆ రాత్రే దొంగిలించుకుపోయాడు. వాన్ని మునక్కాయంత ముసలమ్మ చూసింది. వెంటనే పొట్లకాయంత పోలీసుకు ఫోన్ చేసి, ఆ విషయం చెప్పింది. వెంటనే పొట్లకాయంత పోలీసు గంజిగడ్డంత గన్ను తీసుకుని, లవంగమొగ్గంత లాఠీ పట్టుకొని, జీలకర్రంత జీపులో వేగంగా వచ్చి, దోసకాయంత దొంగోడ్ని పట్టుకొని, వంకాయంత వజ్రాన్ని చింతకాయంత చిన్నోనికి ఇప్పించి, దోసకాయంత దొంగోడ్ని జీలకర్రంత జీపులో తీసుకెళ్ళి, జామకాయంత జైల్లో పెట్టి, తాటికాయంత తాళం వేశాడు!! ఏమంటారు మరి?

***

### గంగమ్మక్క, టింబక్టు బడి చెప్పిన చింతకాయంత చిన్నోని కథ:




ఉల్లిగడ్డంత ఊళ్ళో చింతకాయంత చిన్నోడు ఉండేవాడు. ఒక రోజు ఉర్లగడ్డంత ఊరోడు పోయి, చింతకాయంత చిన్నోడితో, ఒరే ! చింతకాయంత చిన్నోడా ! నువ్వు ఏం చదివావురా? అని అడిగాడు. అందుకు చిన్నోడు, టెంకాయంత టెన్త్ క్లాస్ చదివాను అన్నాడు. మరి నీకు ఏం వచ్చింది రా ? అని ఉర్లడంత ఊరోడు అడిగాడు. వంకాయంత వజ్రం వచ్చింది, అని చింతకాయంత చిన్నోడు చెప్పాడు. దాన్ని ఎక్కడ దాచావు ? అని అడిగాడు ఉర్లగడ్డంత ఊరోడు. అందుకు చిన్నోడు బీరకాయంత బీరువాలో పెట్టి తాటికాయంత తాళం వేశాను. అని చెప్పాడు. అది దోసకాయంత దొంగోడు విని తాటికాయంత తాళం తీసి బీరకాయంత బీరువాలోని వంకాయంత వజ్రాన్ని దొంగిలిస్తుంటే , మునక్కాయంత ముసలమ్మ చూసి, పొట్లకాయంత పోలీసుకు చెప్పింది. పొట్లకాయంత పోలీసు కాకరకాయంత కారులో వెళ్ళి, దోసకాయంత దొంగోడిని పట్టుకుని, జామకాయంత జైల్లోవేసి, బెండకాయంత బెత్తంతో కొట్టి, వంకాయంత వజ్రాన్ని రాబట్టి, చింతకాయంత చిన్నోడికి ఇచ్చాడు.

***

# కీలుగుర్రం

*జానపదకథల్ని విఠలాచార్యలాంటి దర్శకులు సినిమాలుగాతీస్తే ఒకప్పుడవి సంచలనాలయినాయి. ఆ తర్వాత వాటికి మళ్ళీ అంతటి ప్రేక్షకాదరణ లభించలేదు. కానీ అవి జనపదాల్లో సజీవంగా ఉంటూనే వచ్చాయి. "కీలుగుర్రం" కథలు మీరు అనేకం విని ఉంటారు. ఏడవ తరగతి, రేణుక కష్టపెట్టి, ఉత్సాహంగా అనేకమార్లు చెప్పిన ఈ అతిపెద్ద కథ, మీకూ పాత రోజులను గుర్తుచేస్తుందని, ఇక్కడ ప్రచురిస్తున్నాము. మెలికలు మెలికలు తిరిగే ఈ కథ సుఖాంతం అవ్వటం కూడా యాదృచ్ఛికం కాదు- అందరికీ తెల్సిందే!*

పూర్వం ఒక దేశాన్ని ఓ అందమయిన రాజు పాలించేవాడు. ఆ రాజుకు ఒక భార్య ఉండేది. వారి రాజ్యం సిరిసంపదలతో, పాడిపంటలతో తులతూగేది.

ఒకసారి, రాజు వేటకని అడవికి వెళ్ళాడు. ఆ అడవిలోని రెండు ఆడదయ్యాలు రాజును చూసి, అందగాడయిన ఆ రాజును ఎలాగయినా పెళ్ళాడాలనుకొన్నాయి. నేను చేసుకొంటానని ఒకటంటే, కాదు, రాజు నావాడన్నది మరో దయ్యం. రెండూ న్యాయంకోసం మరో దయ్యం దగ్గరికి వెళ్ళాయి. 'రాజు వేటాడుతున్న అడవికి తూర్పుకు ఒకరూ, పడమటికి మరొకరూ వెళ్ళండి. రాజు ఏ దిక్కుకు వస్తే ఆ దిక్కున ఉన్నవాళ్లు రాజును పెళ్ళి చేసుకోండి' అని చెప్పింది ఆ దయ్యం. రాజును పెళ్ళాడిన వారు గెలిచినట్లు, మరొకరు ఓడినట్లు. మరి ఓడినవారు గెలిచినవారు చెప్పినట్టు వినాలి' అని కూడా తీర్పు చెప్పిందది.

దయ్యాలు రెండూ అందుకు అంగీకరించాయి. వాటిలో పెద్దదేమో తూర్పుకూ, చిన్నదేమో పడమటికీ వెళ్ళాయి. ఆరోజున రాజు తూర్పు వైపుకు వెళ్ళాడు! ఇక తూర్పువైపునున్న పెద్దదయ్యం అందమైన కన్యగా మారి రాజుకు ఎదురుపడింది. రాజు ఆమె అందానికి ముగ్దుడయి, ఆమెను పెళ్ళిచేసుకొని తనతో తీసుకెళ్ళాడు.

రాజును పెళ్ళాడిన పెద్ద దయ్యం వెంటనే తనప్రాణాలను, ఓ చిలకలో ఉంచి, దాన్ని ఓడిపోయిన దయ్యానికిచ్చి, ఏడు చెరువులూ, ఏడు నదులూ, ఏడు సముద్రాలూ దాటి, అక్కడున్న పెద్ద మర్రితొర్రలో ఉంటూ తన ప్రాణాలను కాపాడుతూ ఉండమని చెప్పి పంపేసింది. అలా అది తన ప్రాణాలకు రక్షణ తెచ్చుకోవటంతోపాటు తన పోటీదారుకు దేశ బహిష్కారం కూడా చేయగల్గింది.

ఆ సమయంలోనే రాజు మొదటి భార్య గర్భవతి అయ్యింది. కొన్నాళ్ళు గడిచాయి. రెండవ రాణిగా ఉంటున్న పెద్ద దయ్యానికి రాజభవనంలోని తిండి ఏమాత్రమూ రుచించలేదు. రోజూ దొరికిన ప్రతీ జంతువునూ తినే దానికి ఆ తిండి ఎలా నచ్చుతుందిమరి?! ఒక ఉపాయం ఆలోచించి ఒక నాటి రాత్రి బయటికి పోయి కోటలోని జంతువులను తిని వచ్చింది.
ఉదయాన్నే భటులు పరుగుపరుగున వచ్చిరాజుతో జంతువులన్నీమాయమయ్యాయన్న విషయాన్ని చెప్పారు. రాజు తగిన ఏర్పాట్లు చేయించాడు. సరిగ్గా అప్పుడే రాజు గారి మొదటి భార్యకు, రెండవ భార్యమీద అనుమానం వచ్చింది. అది తెలుసుకొన్న రెండవ భార్య, మరునాటి రాత్రికీ ఆహారం కోసం వెళ్ళివచ్చి, రాణి పక్కన రక్త మాంసాలను వేసి, రాణి మూతికీ, చేతులకూ రక్తాన్ని పూసింది. మరునాడు ఉదయమే భటులొచ్చి విషయాన్ని రాజుతో చెప్పారు. ఇంతలోనే రాజు రెండవ భార్య వచ్చి, రాణిగదిలో రక్తమాంసాలున్నట్లు చెప్పింది. అది చూసి రాజు, తన మొదటి భార్యే జంతువులన్నింటినీ చంపి తింటున్నదని అనుకొని, ఆమె కళ్ళు పీకి, అడవిలో వదలి రమ్మన్నాడు. భటులు, రాజుమాటను పాటించారు.

అడవిలో ఉన్న గుడ్డి రాణిని ఒక ముని చేరదీశాడు. ఆమెకు ఒక కొడుకు కుడా పుట్టాడు. ఆ ముని, ఆ అబ్బాయికి అన్ని విద్యలూ, నేర్పాడు.
ఇదిలా ఉండగా, రాజు రెండవ భార్యగా ఉంటున్న దయ్యం రాజ్యంలోని చాలా జంతువులను , తినేసింది. రాజ్యంలో కరువు తిష్ఠ వేసింది. మరోవైపున రాకుమారుడు విద్యాభ్యాసం ముగించుకొని, దేశాటనకు తన కీలుగుర్రం ఎక్కి బయలుదేరాడు.




ఒక నాటి రాత్రికి రాజుగారి కోటను చేరాడు. ఆకాశంలోనుండి చూస్తున్న రాకుమారునికి, కోటలోని ఏనుగును తింటున్న ఓ దయ్యం కనిపించింది. అంతలోనే ఆ దయ్యం కూడా రాకుమారుణ్ణి చూసి, రాణిగా మారి కోటలోకి మాయమయింది. దాన్ని రాకుమారుడు గమనించాడు.

దయ్యం వీడి పీడను ఎలాగయినా వదిలించుకోవాలని, మర్నాటి ఉదయం తలనొప్పి, తలనొప్పి... అంటూ నటనమొదలెట్టింది. రాజవైద్యుల వైద్యం రాణి తలనొప్పిని తగ్గించలేకపోయింది. అపుడు రాణి, రాజా ! నా తలనొప్పి పోగొట్టే మందు ఇక్కడెక్కడా లభించదు. ఏడుచెరువులూ, ఏడు నదులూ, ఏడు సముద్రాలూ దాటి, అక్కడున్న పెద్ద మర్రి చెట్టు తొర్రలో నేనిచ్చే చీటీ ఇస్తే, నాకు కావలసిన మందు దొరుకుతుందని చెప్పింది.

రాజు అంత దూరం పొయ్యివచ్చేవారికోసం దండోరా వేయించాడు. మందుతెచ్చిన వారికి తన రాజ్యంలో సగ భాగాన్ని ఇస్తానన్నాడు. విషయాన్ని తెలుసుకున్న రాకుమారుడు, ఆ పని తను చేస్తానన్నాడు. రాజు సంతోషంతో, విషయాన్ని రాణికి చెప్పాడు. రాణి ఆ అబ్బాయిని చూసి "వీణ్ణి చంపి తిను" అని తన భాషలో ఒక చీటీని రాసి ఇచ్చి, 'ఇక వీడి పీడ వదిలిపోతుంది' అనుకుని తృప్తి పడింది.

రాకుమారుడు ఆ చీటీని తీసుకొని తన కీలు గుర్రం ఎక్కి బయలుదేరాడు. ఏడు చెరువులూ, ఏడు నదులూ, ఆరు సముద్రాలూ దాటాక, రాకుమారునికి ఒక ముసలి దయ్యం, అనారోగ్యంతో కదలలేక కనిపించింది. రాకుమారుడు జాలితో ఆ దయ్యానికి సాయం చేశాడు. నాలుగు రోజులు అక్కడే ఉన్నాడు కూడా. నాల్గవ నాటి రాత్రి రాకుమారుని జేబులోని చీటీ కిందపడి, ముసలి దయ్యానికి దొరికింది. దయ్యం చీటీని చదివి అయ్యో ! ఇంత మంచి అబ్బాయిని ఎవరో చంపాలని పన్నాగం పన్నారు. అలా జరగడానికి వీలు లేదు. వారినే అంతం చేయాలని, ఆ చీటీని చించి "ఇతన్నిబాగా చూసుకో . నా ప్రాణాలను ఇతని చేతికిచ్చి పంపు" అని మరో చీటీ రాసి రాకుమారుని జేబులో ఉంచింది.

మర్నాటి ఉదయం రాకుమారుడు బయలుదేరి ఏడవ సముద్రాన్ని దాటి, అక్కడున్న మర్రి తొర్ర వద్దకువెళ్ళి, 'ఎవరమ్మా లోపల?' అని అడిగాడు. లోపలినుండి ఒక అందమైన ఆడ మనిషి వచ్చి, ఎవరు కావాలన్నది. రాకుమారుడు తన దగ్గరున్న చీటీని ఆమెకిచ్చాడు. ఆమె ఉత్తరాన్ని చదివి, తన యజమాని దయ్యం తన కొడుకునే పంపిందేమోననుకొని, అన్ని విషయాలూ రాకుమారుడితో చెప్పేసింది. దయ్యం ప్రాణాలున్న చిలుకను అతనికి ఇచ్చేసింది కూడా.


రాకుమారుడు మరునాడే బయలుదేరి, ఒక నాటి రాత్రికి కోటను చేరాడు. ఆ సమయానికి దయ్యపు రాణి కోటలోని గుర్రాలను తింటున్నది. అది చూసిన రాకుమారుడు, దయ్యం ప్రాణాలున్న చిలుక కాళ్ళనూ, రెక్కలనూ విరిచాడు. దయ్యం కాళ్ళూ, చేతులూ పోయి, భాదతో గట్టిగా అరిచింది. ప్రజలంతా వచ్చారు. రాజు కూడా వచ్చాడు. అందరూ అక్కడి పరిసరాలనుచూసి, భయపడ్డారు. రాకుమారుడు తన కీలు గుర్రం దిగివచ్చి ఓ దయ్యమా ! ఇప్పటికయినా నిజం చెప్పమన్నాడు. దయ్యం జరిగినదంతా చెప్పేసింది. రాజు కోపంతో చిలుకను, దానితోపాటు దయ్యాన్ని చంపేశాడు.

తమ రాజ్యాన్ని గొప్ప ఆపద నుండి కాపాడినతను ఎవరని రాకుమారుణ్ణి, అడిగాడు రాజు. రాకుమారుడు తన చరిత్రనంతా రాజుతో చెప్పాడు. అప్పుడు రాజు, తన తల్లిని చూపించమని రాకుమారుణ్ణి అడిగాడు. రాకుమారుడు తన తల్లిని చూపాడు. తన తప్పును గుర్తించిన రాజు రాణిని, కుమారుడిని క్షమాపణ వేడాడు. ఆ తరువాత అందరూ కలిసి సుఖంగా జీవించారు.

# అవ్వ-కోయిల

*పిల్లల సృజనకూ, వారిలోంచి ఊట మాదిరి స్రవించే మంచితనానికీ, ప్రతీకగా అనిపించింది మాకీ కథ. అవ్వ, కోయిల, కుందేలు, ఆవు అందరూ ఎందుకు కలసిమెలసి ఉన్నారో చూసి మీరూ కొంచెం ఆలోచిస్తారని, మీకోసం 4వ తరగతి రాజు రచించిన ఈ కథ.*

ఒక ఊరిలో ఒక అవ్వ ఉండేది. ఆ అవ్వకు ఒక కోయిల ఉండేది. అవ్వ కోయిలను చాలా బాగా చూసుకొనేది. ఒక రోజు అవ్వకు జ్వరం వచ్చింది. అపుడు కోయిలకు ఏమి చేయాలో అర్థం కాలేదు. అప్పుడది చాలా ఆత్రంగా తన మిత్రుడయిన కుందేలు దగ్గరికి వెళ్ళింది. కుందేలును కలిసింది. అప్పుడు, కుందేలు వచ్చిన మిత్రుడిని ఆప్యాయంగా పలకరించి, కోయిల రాకకుగల కారణాన్ని అడిగింది. కోయిల అవ్వకు, జ్వరంగా ఉన్న సంగతి చెప్పింది. 'అవునా ! అరె ! పద..పద..పోదా'మని కుందేలూ, కోయిలా అవ్వదగ్గరికి వెళ్ళాయి. అవ్వను చూసాక కుందేలు 'మిత్రమా ! నువ్వేమీ భయపడకు. ఈ జ్వరం ఇవ్వాళ కాకపోతే, రేపు పోతుందిలే! మరి నేను వెళ్ళి రేపు మళ్ళీ వస్తా'నని చెప్పి, వెళ్ళిపోయింది.



మరునాడు అది మళ్ళీ వచ్చింది; కానీ అవ్వకు జ్వరం తగ్గలేదు. కుందేలు ఆలోచించి, అవ్వకు తన మిత్రుడయిన ఆవు ఇచ్చే పాలను ఇస్తే, జ్వరం నయమవుతుందేమోనని, ఆవు దగ్గరికి వెళ్ళి, తన సహాయాన్ని అడిగింది. ఆవు, సంతోషంగా ఒప్పుకొని, కుందేలుతోపాటుగా అవ్వవాళ్ళ ఇంటికి వెళ్ళింది. కుందేలు పాలు పితికి, వాటిని కాంచి అవ్వకు ఇచ్చింది. అవ్వ పాలను తాగింది. మర్నాడు అవ్వకు జ్వరం బాగయింది. అందరూ చాలా సంతోసించారు. కలసిమెలసి ఆనందంగా జీవించారు.

# కుడాలు

*మొరటోని కథలు హాస్యానికి ఆలవాలాలు. ఇలాంటి కథలు మన జానపదాల్లో అనేకం లభిస్తాయి. ఇతర ప్రాంతాల్లో కుడుములు/పూర్ణాలుగా పిలుచుకునే ఒక రకం పిండి వంటల్ని అనంతపురం జిల్లాలో 'కుడాలు' అంటారు. మీకోసం వండిన ఈ కుడాల కథను ------ రాశాడు. తిని ఆనందించండి.*

ఒక ఊరిలో ఒక మొరటోడు ఉండేవాడు. అతను గొర్రెలు కాసేవాడు. ఒక రోజు మొరటోడు గొర్రెలు మేపడానికి వెళ్ళాడు. అప్పుడొకాయన ఆ దారిన వచ్చి, 'ఓయప్పో ! దామాజిపల్లికి ఇక్కడ నుండి ఏదారిన పోవాలప్పా?' అని అడిగాడు. 'ఈ దారి పోతుందప్పా!' అని మొరటోడు చూపిస్తూ, 'చేతిలో ఆ క్యారియర్ ఏందప్పా?' అని తిరిగి అడిగాడు. 'ఇవి కుడాలు' అని చెప్పాడు ఆ బాటసారి.

'ఏదీ, ఒకటీయప్పా! అని అడిగాడు మొరటోడు. ఆయన ఒకటిచ్చాడు ఇతనికి. అది తిన్న మొరటోడు 'భలే ఉంది, ఇదేమిటప్పా' అని మరోసారి అడిగాడు. 'ఇవి కుడాలప్పా!' అని చెప్పి వెళ్ళాడు ఆయన.



అవి బాగా నచ్చిన మొరటోడు, తను వాటి పేరు మర్చిపోకుండా ఉండేందుకని 'కుడాలు... కుడాలు.. కుడాలు' అనుకుంటూ ఇంటికి బయలుదేరాడు. మరి, దారిలో ఒక కాలువ అడ్డం వచ్చింది. కాలువను దాటేందుకుగాను 'హుష్.... ' అని ఎగరాల్సి వచ్చింది మొరటోడికి. ఆ ప్రయత్నంలో 'కుడాల'ను మరిచి పోయాడు వాడు.

ఇక ఇంటికి చేరుకొని తన భార్యతో 'ఏమేయ్ ! నాకవి చేసిపెట్టు, హుష్.. అనటం మొదలుపెట్టాడు. 'ఏవండీ?' అని అడిగింది భార్య. అవేనే..హుష్.. అవి' చెయ్యమంటాడు మొరటోడు. 'అయ్యో, హుష్ అంటే ఏవండీ?' అని మళ్ళీ అడిగింది భార్య. 'అవేనే, హుష్- అంటే ఏవంటావా?' అని భార్యను చితకబాదాడు మొరటోడు. ఆమె కెవ్వుమన్నది.

ఇరుగు పొరుగు వారందరూ వచ్చి విషయం తెలుసుకొని, 'ఎందుకయ్యా నీ భార్యను అలా కొట్టావు? చూడు, తన శరీరం మీద ఎలా కుడాలు కాశాయో' అన్నారు.

'ఆ...ఆ...అవే.. అవే..కుడాలు... కుడాలు, అవే నేను చేసిపెట్టమన్నది అన్నాడు మొరటోడు. 'అదేదో ముందుగానే చెప్పుంటే చేసిపెట్టేదాన్నికదా! అని తన భర్తకు కుడాలను చేసి పెట్టిందా భార్య.

పాపం, భార్య!!!

# నిజమైన స్నేహం

*నీతికథలనుండి నేర్చుకునే నీతి- నేతి బీరకాయలోంచి తాగే నెయ్యి ఒకటే అని మాకు నిజంగా అనుమానం . అయినా, పిల్లలు రకరకాలుగా ఉంటారు- ఎవరికి ఏ కథ నచ్చుతుందో ఎవరికి తెలుసు? ఎవరికి ఏది స్ఫూర్తినిస్తుందో ఎవరికెరుక? మీకు ఈ కథ నచ్చుతుందేమో?! ఎక్కడినుండో, ఎంత వయసో తెలీని వీరన్న రాసిన ఈ కథను ఈ ఉద్దేశంతో ప్రచురిస్తున్నాం. చదివి మీకెలా అనిపించిందో చెప్పండి.*

అనగనగా ఒక అడవి. ఆ అడవిలో "చిన్నా" అనే జింకపిల్లకూ, చందూ అనే నక్కపిల్లకూ స్నేహం కుదిరింది. అవి రెండూ ఆ అడవిలో, ప్రతిరోజూ కబుర్లు చెప్పుకుంటూ తిరిగేవి. ఒకనాడు అవి అలా తిరుగుతూండగా, ఎక్కడినుండో పెద్దగా ఉరిమినట్టుగా, ఒక సింహం గర్జించింది. అది విన్న ఆ రెండూ ప్రాణభయంతో, పరుగులుతీసాయి. అలా పరిగెత్తుతుండగా చిన్నా కాలు బెణికి, కింద పడిపోయింది.

అప్పుడు భయంతో వణికిపోతూ, చిన్నా అరిచింది: " చందూ ! నేను పడిపోయాను. లేవలేకున్నాను. కాస్త వచ్చి సాయంచేయవా?" అని ఆత్రంగా అడిగింది. అప్పుడు చందూ "అమ్మో ! ఇప్పుడు నేను వచ్చానంటే, ఆ సింహం చేతికి నేనూ దొరికిపోయినట్టే ! నేను రాలేను బాబూ!" అని పారిపోయింది.

చిన్నాకు ఏమిచేయాలో దిక్కు తోచలేదు. అది ఏడుస్తూ అక్కడే పడిపోయింది. అంతలో సింహం రానే వచ్చింది. అది భయంతో వణుకుతున్న జింక పిల్లను చూసి "ఓ జింకపిల్లా ! భయపడకు. నేను నిన్ను ఏమీ చేయను. నాకు ఆకలిగా ఉన్నప్పుడు మాత్రమే నేను జంతువులను చంపుతాను. నాకిప్పుడు ఆకలిగా లేదు. కాబట్టి నువ్వు భయపడాల్సిన అవసరం ఏమీ లేదు" అని చెప్పి వెళ్ళిపోయింది. జింకపిల్లకు పోయిన ప్రాణం తిరిగొచ్చినట్టయింది. 'బ్రతుకు జీవుడా !' అనుకొని, మెల్లిగా పైకి లేచి కుంటుతూ ముందుకు సాగింది.

ఇంతలో ఆ పక్కనుండి 'కాపాడండి... కాపాడండి...' అని అరుపులు వినబడ్డాయి. 'అరె ! ఇవి చందూ అరుపుల్లాగా ఉన్నాయే!' అని చిన్నా అటువైపుకు పరుగెత్తింది. చూడగా, చందూ అక్కడ ఒక బురద గుంతలో చిక్కుకొని అరుస్తున్నది. 'అయ్యో ! చందూ, బురదలో ఇరుక్కుపోయావా ! రా...రా...రా...' అంటూ చిన్నా, చందూని గుంతలోనుండి బయటకు లాగింది.

బయటకువచ్చిన చందూకి తన స్వార్థాన్ని తలుచుకొని సిగ్గేసింది. తన మొహాన్ని అది చిన్నాకు చూపలేకపోయింది. 'చిన్నా ! నువ్వు ఎంతో మంచివాడివి. నువ్వు ప్రమాదంలో ఉన్నప్పుడు నేను నిన్ను కాపాడకున్నప్పటికీ, నన్ను మాత్రం నువ్వు కాపాడావు. నిజమైన మంచి స్నేహితుడివంటే నువ్వే. నన్ను క్షమించు' అన్నది. 'మన మధ్య క్షమాపణలెందుకు మిత్రమా! పద, పోదాం' అని చిన్నా అన్నది.

ఆపదలో ఉన్నప్పుడు ఆదుకొనేవాడే నిజమైన, మంచి మిత్రుడు. చేసిన తప్పును క్షమించగలిగేదే నిజమైన స్నేహం.

# సామాజిక న్యాయం

*అనంతపురంజిల్లా ననకోటమండలంలోని అంబేద్కర్ బాలల సంఘపు చిన్నారి బి.రమేష్ ఒక చిన్న కథని గుర్తుచేసుకొని, మనందరితోటీ పంచుకునేందుకు ఇచ్చాడు. రమేష్ కథనాన్ని ప్రోత్సహించేందుకు ప్రచురిస్తున్న ఈ కథలో దాగున్న గతితార్కిక దృక్పథం మాకు ఆశ్చర్యం కలిగించింది. చిన్న చిన్న కథల్లో గహనమైన తాత్విక అంశాల్ని పరిచయం చేసిన రచయితలు ధన్యులు*

ఒకప్పుడు, ఒక చిన్న ఎర్ర కోడి పెట్ట ఉండేది. దానితోపాటే, ఒక పందీ, ఒక బాతూ, ఒక పిల్లీ ఉండేవి. ప్రతీ రోజూ కోడిపెట్ట ఇంటిని శుభ్రం చేసేది. తక్కినవన్నీ సోమరిపోతులు. ఏ పనీ చేసేవికాదు. ఏరోజూ కోడిపెట్టకు సాయపడేవి కాదు.

ఒకసారి కోడిపెట్ట ఒక మొక్కజొన్న గింజను తెచ్చింది. 'దీనిని ఎవరైనా నాటుతారా?' అని తక్కినవాటిని అడిగింది. మిగిలినవన్నీ"మావల్ల కాద'ని చెప్పాయి. కోడిపెట్టే దానిని నాటింది. అది మొలకొచ్చి, పెరిగి పెద్దదై మంచి పంటనిచ్చింది.

ఈసారి, 'ధాన్యం కోయడానికి ఎవరు సాయపడతార'ని అడిగింది కోడిపెట్ట. ఎవ్వరూ ముందుకు రాలేదు. కోడిపెట్ట ధాన్యమూ కోసింది; వాటిని ఆరపెట్టి పిండీ చేసింది.

పిండితో రొట్టె చేయాలనుకొని, రొట్టె చేయడానికి ఎవరినైనా సాయం రమ్మంది. అప్పుడవన్నీ సాకులు చెప్పాయి. ఏవీ సాయం పట్టలేదు. ఏం చేస్తుంది, ఇక కోడిపెట్టే రొట్టెలూ కాల్చింది.

ఈసారి కోడిపెట్ట 'రొట్టెలు తినడానికి ఎవరొస్తార'న్నది. 'నేనంటే , నేన'న్నాయి తక్కినవన్నీ.

"గింజ నాటిందీ నేను. పంట కోసిందీ నేను. పిండి చేసిందీ నేను. రొట్టెను కాల్చిందీ నేను. కనుక రొట్టెను తినేదీ నేనే" అని కోడిపెట్ట రొట్టెను తినేసింది.

# కుండ రాకుమారి కథ


*ఇంగ్లీషువాళ్ళ "ఫెయిరీటేల్స్" తెలుగులోకి వచ్చేసరికి, ఇలాంటి జానపద కథలవుతాయేమో. వీటిలోని అవాస్తవికత, అసహజత్వమూ పెద్దలకు ఒకింత అసంతృప్తిని కలిగించే అవకాశం ఉంది. కానీ ఇంగ్లీషు కథలు చదవని చిన్నారులకు ఇవీ నచ్చుతాయేమో. మీరూ చూడండి. మీ అభిప్రాయాన్ని తెలపండి. ఈ కథని బషీర్, ప్రకృతిబడి మీకోసం తెలుగులో గుర్తు చేసుకుంటున్నారు.*

అనగనగా, ఒక దేశం. ఆ దేశం పేరు మార్కాపురం. ఆ దేశాన్ని పాలించే రాజు చాలా మంచివాడు. చాలా కాలం వరకూ అతనికి పిల్లలు కలగలేదు. ఎన్నో నోములూ, వ్రతాలూ చేసిన పిదప అతనికో ఆడపిల్ల కలిగింది. పాప పుట్టిన కొంతకాలానికే రాణి చనిపోయింది. రాజు మరో పెళ్ళి చేసుకున్నాడు. రాజుగారి రెండవ భార్యకూ పిల్లలు కలిగారు.

రాజు పిల్లలందరినీ ఎంతో ప్రేమగా చూసుకొనేవాడు. రాణి మాత్రం, తన పిల్లలను మాత్రం బాగా చూసుకొంటూ, మొదటి భార్య కూతురిని నానా కష్టాలకూ గురిచేసేది. అయినా రాజు ముందు మాత్రం ఎంతో ప్రేమను నటించేది. రాకుమారి పడుతున్న కష్టాలను, చూస్తున్న ఒక సేవకి, రాకుమారిని ఎలాగైనా తన పినతల్లికి దూరంగా పంపించేయాలనుకున్నది.

ఒక ఉపాయం ఆలోచించి, ఒక పెద్ద కుండను చేయించి అందులో రాకుమారిని ఉంచి, ఎవరూ లేని సమయంలో రాకుమారిని పొరుగు రాజ్యంలోని తనబంధువయిన ఒక పువ్వులమ్ముకుంటూ బ్రతికే ముసలవ్వ ఇంటికి పంపింది. కుండలోని రాకుమారి నడుచుకుంటూ వెళ్ళి అవ్వ ఇంటికి చేరింది. 'అవ్వా ! అవ్వా ! నేనుకూడా నీతో ఉంటానవ్వా!' అని అడిగింది.

అవ్వ ఆశ్చర్యంతో 'కుండమాట్లాడుతున్నదేమిటి?' అనుకొంది. ''ఓ మాట్లాడేకుండా ! నేను పువ్వులు అమ్ముకొని కష్టపడుతూ బ్రతుకుతున్నాను. నువ్వూ నాతో ఉండాలంటే రోజూ పూలమొక్కలకు నీరు పోయాల్సి ఉంటుంది' అని చెప్పింది. కుండలోని రాకుమారి ఒప్పుకుంది.



రోజూ అవ్వ పువ్వులన్నిమాలలుగా కుట్టి ఆ ఊరి రాజు గారింట్లో ఇచ్చివచ్చేది. అవ్వ అలా వెళ్ళగానే రాకుమారి కుండలోనుండి బయటికి వచ్చి, పూలమొక్కలకి నీరు పోసేది.

ఇదిలా ఉండగా ఆ దేశపు రాజు తన కుమారునికి పెళ్ళి చేయాలనుకున్నాడు. ఎందరో రాజకుమార్తెలను రాకుమారునికి చూపించినా, రాకుమారుడు నచ్చలేదన్నాడు.

అంతలో ఒకసారి, అవ్వకు జ్వరం వచ్చి, పువ్వులను రాజుగారికి ఇచ్చి రమ్మని కుండతో చెప్పింది. కుండ పూలమాలలు తీసుకొని బయలుదేరి, నడుచుకుంటూ వెళ్ళి రాజుగారింట్లో పూలను ఇచ్చింది. అది రాకుమారుడు చూసి, ఇదేదో విడ్డూరంగా ఉన్నదే ? అనుకొని విషయాన్ని తెలుసుకోవాలనుకొన్నాడు. కుండను చాటుగా వెంబడించాడు. కుండ నడుచుకుంటూ వెళ్ళి నది దగ్గరికి వెళ్ళి, అటూ ఇటూ చూసింది, దానిలోంచి రాకుమారి బయటకు వచ్చి నదిలోకి వెళ్ళి స్నానం చేసింది. ఆమె చాలా అందంగా ఉన్నది. అందమైన రాకుమారిని చూసి ఆమెను పెళ్ళిచేసుకోవాలనుకున్నాడు యువరాజు.

ఇక ఆ యువరాజు ఇంటికెళ్ళి తనొక కుండను పెళ్ళి చేసుకొంటానన్నాడు. ఇంతమంది రాకుమార్తెలుండగా, కుండను పెళ్ళి చేసుకోవటమేమిటని అడిగారు వాళ్ళ పెద్దలు. కానీ రాకుమారుడు పట్టిన పట్టు విడవలేదు. తమ కుమానికేదో పిచ్చి పట్టినట్లుందని, ఎలాజరిగితే అలా జరగనిమ్మని వాళ్ళు అందుకు ఒప్పుకొని, అవ్వను కలిసి, కుండనూ ఒప్పించారు.

పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ జరిగాయి. రాకుమారుడు ఒక కుండను పెళ్ళిచేసుకుంటున్నాడన్న విషయం విన్న ప్రజలంతా పెళ్ళిని చూడటానికి ఎగబడ్డారు. అందరూ చూస్తుండగా రాకుమారుడు కుండ మెడలో తాళి కట్టాడు. తర్వాత, కావాలని కాలు తడబడినట్టు నటిస్తూ కుండమీద పడ్డాడు.

కుండ పగిలి ఆశ్యర్యంగా అందులోనుండి అందమైన రాకుమారి బయటికి వచ్చింది. యువ రాజు జరిగినదంతా వివరించాడు. రాజూ, రాణి, అక్కడున్నవారంతా చాలా సంతోషించారు. అప్పటినుండీ రాకుమారి అక్కడ చాలా సంతోషంగా జీవించింది.

# ఎవరు గొప్ప

*అర్థంలేని కథలు చెప్పి ప్రశ్నలు అడగటం మన జానపదులకే చెల్లింది. అస్సలు అర్థంలేని గొప్ప కథ ఒకటి ఉన్నది ఇక్కడ. అది చదివి ఎవరు గొప్పో తేల్చగల్గితే మీకు అక్షరలక్షలు లభించగలవు. ప్రయత్నించండి మరి.*

*రచన: గంగమ్మ, టింబక్టు బడి, చెన్నే కొత్తపల్లి*

పూర్వం తూర్పుదేశంలో చెంబన్న, పడమటి దేశంలో మంబన్న అనే ఇద్దరు బలశాలులు ఉండేవారు. వారి బలాబలాలను గూర్చి చుట్టుపక్కలవాళ్ళు బహుగొప్పగా చెప్పుకొనేవారు. చెంబన్న,మంబన్నలు ఒకరినిగూర్చి మరొకరు విన్నారేకాని, వారు ఒకరినొకరు ఎన్నడూ చూసుకోలేదు.

ఒక రోజు చెంబన్న, మంబన్నను చూడడానికి బయలుదేరాడు. ప్రయాణానికన్నీ సిద్దంచెయ్యమన్నాడు భార్యను. చెప్పిందే తడవుగా చెంబన్న భార్య ఊరిలోని అమ్మలక్కలను అందరినీ అడిగి , పాత చీరలన్నీపోగుచేసి, ఒక బొంతగా కుట్టి, అందరి సాయంతో వంట చేసి, వరిబువ్వా, ముద్ద పప్పు, ఊరగాయ, నెయ్యీ వేసి బొంతనిండా సద్దిని కట్టించింది. ఆ సద్ది మూటను ఒక ఏనుగుమీదుంచి భర్తను సాగనంపింది.
చెంబన్న, ప్రయాణం చేసీ, చేసి మాపటేళకు ఒక చోట ఆగి, సద్దిమూటను విప్పిభోజనం తిన్నాడు. భోంచేశాక బొంతను ఒక పెద్ద చింతమాను మీద ఆరేసి, మళ్ళీ తిరుగుప్రయాణంలో తీసుకోవచ్చునులే అనుకొని ప్రయాణాన్ని కొనసాగించాడు. సాయంత్రానికి మంబన్న ఊరిని చేరుకొని మంబన్న గురించి ఆరాతీయసాగాడు.

కట్ట మీద కూర్చున్న ఒక ముసలి తాతను మంబన్న ఇల్లు ఎక్కడుంటుందని అడిగాడు. అదిగో ! అక్కడ బిందెలో నీళ్ళు తెస్తోందే, ఆమే మంబన్న భార్య అని తాత చెప్పాడు. అపుడు చెంబన్న, మంబన్న భార్యతో మాట్లాడి తాను, మంబన్నను చూడాలనీ, అతనితో మాట్లాడాలనీ చెప్పాడు. సరే అని చెంబన్నను, మంబన్న భార్య వాళ్ళ ఇంటికి తీసుకపోయింది. అన్నా! ఇప్పుడే వస్తాను, అలా ఆ మంచం వాల్చుకొని కూర్చోమని చెప్పి లోపలికి వెళ్ళింది. చెంబన్నకు అది అవమానంగా అనిపించింది. అయినా తప్పదుగదా. "ఒక ఊరి రెడ్డి మరోఊరి పాలేగాడు" , అనుకొని మంచం వాల్చబోయాడు. మంచం వంగలేదు. కొంచెం గట్టిగా ప్రయత్నించాడు. మంచం కదలనేలేదు. బలమంతా ఉపయోగించి చూసాడు. కానీ మంచాన్నిమాత్రం కదపలేకపోయాడు. ఇక మంచాన్ని చూస్తూ ఆశ్చర్యపోవడం చెంబన్న వంతయింది. ఇంతలో మంబన్న భార్య వచ్చి, కూర్చోమంటే అలా నిలబడ్డావేందన్నా? అంటూ వచ్చి తన చిటికెన వేలితో మంచాన్ని వాల్చింది. చెంబన్న ఆశ్చర్యంతో, మంబన్న, భార్యనే ఇంత బలవంతురాలే ! ఇక మంబన్న ఎంత బలవంతుడయి ఉంటాడో ? అనుకున్నాడు.

ఇంతలో మంబన్న భార్య వచ్చి, ఆయన ఉదయం వస్తారు, మీరు ఈ రాత్రికి ఇక్కడే ఉండండని, ఒక చాపా, రగ్గూఇచ్చి, ఇక్కడ పడుకొమ్మని బయట ఒక అరుగును చూపించింది. అరుగు మీద పడుకున్న చెంబన్నకు, నిద్ర పట్టలేదు. అమ్మో! ఉదయం వరకూ నేను ఇక్కడే ఉంటే మంబన్న చేతిలో నాకు పరాజయం తప్పదు, అనుకొని తెలవారకనే బయలుదేరి వెళ్ళిపోయాడు. అలా ఆయన వెళ్ళిన కొంతసేపటికే మంబన్న ఇంటికి వచ్చాడు. చెంబన్న వచ్చివెళ్ళిన విషయాన్ని భర్తతో చెప్పింది మంబన్న భార్య. అవునా ! అయ్యో ! నేను ఎంతకాలంనుండీ ఆయనను కలవాలనుకుంటున్నాను. ఇప్పుడే వెళ్ళి ఆయనను కలుసుకొంటానని బయలుదేరాడు.

చెట్టుపైకెక్కి, బొంతను విప్పుకొంటున్న చెంబన్నకు, గుర్రంపైవస్తున్న మంబన్న కనిపించాడు. అతనే కాబోలు మంబన్న! నన్ను ఓడించడానికే వస్తున్నట్టున్నాడు. ఆలస్యం చేస్తే నాకే ప్రమాదం అనుకొని త్వరగా చెట్టును దిగి, దాన్ని వేర్లతోసహా, పెకిలించేసుకొని, తన ఏనుగెక్కి ముందుకు పోయాడు. ఇది చూసిన మంబన్న, చెంబన్న తన మీదకు యుద్దానికి వస్తున్నాడేమోననుకొని, తనూ ఒక తాటి చెట్టును పెకలించుకొని దాన్ని భుజాన పెట్టుకొని, తన గుర్రాన్ని, దౌడుతీయించాడు. కొంత సేపటికి వారిద్దరూ, కలుసుకొని తమలో ఎవరు గొప్పో తేల్చుకోవాలనుకొన్నారు. గెలుపును నిర్ణయించే మధ్యవర్తి కోసం ఎదురుచూశారు. ఇంతలో అంబలి కుండను నెత్తిమీద పెట్టుకొనివస్తున్న సీతాలు వారికి కనిపించింది.




ఇద్దరూ అమె దగ్గరకు పోయి అమ్మా ! మేమిద్దరం యుద్దం చేస్తాము. మాలో ఎవరు గొప్పో నువ్వు తేల్చాలి అని అడిగారు. అందుకు సీతాలు అమ్మో! నిన్ననే నా మొగుడు సద్ది ఆలస్యమైందని మక్కెలు విరగదన్నాడు. ఇక ఈ రోజూ ఆలస్యమయితే, అంతే సంగతి. అంతగా కావాలంటే, మీరిద్దరూ నాభుజాలమీదకెక్కి పోట్లాడండి. నేను వెళుతుంటానని చెప్పింది. ఈ ఉపాయం బాగానే ఉందనుకొని, వారిద్దరూ సీతాలు భుజాలమీద కూర్చొని యుద్దం చేయసాగారు. ఆంత దూరంలో వస్తున్న సీతాలును చూసిన గొర్రెలు కాసే తన భర్త, అయ్యో ! నిన్న నేను తనను కొట్టినందుకు కాబోలు ఇవాళ నన్ను కొట్టించడానికి ఎవరో బలవంతులను తీసుకవస్తున్నది నా భార్య అనుకొని, వాళ్ళకు దొరికితే నన్నెక్కడ బ్రతకనిస్తారు ? బ్రతికుంటే బలుసాకులు తినవచ్చుననుకొని తన కంబళిని పరిచి గొర్రెలనన్నింటినీ అందులొ మూటగట్టుకొని,ఆ మూటను తన నెత్తిన పెట్టుకొని పరిగెత్తసాగాడు.

అలా పరుగెత్తి పోతున్న అతన్ని, పైనుండీ ఓ గ్రద్ద చూసి ఇదేదో పెద్ద మాంసపు ముద్దలాగా ఉన్నదే అనుకొని కిందికొచ్చి తన వాడికాలిగోళ్ళతో అతన్నీ, గొర్రెల మూటనూ ఒక్క తన్నుతో తన్నుకపోయింది. అలా పోతూండగా ఏడంతస్తుల మేడలో తల ఆర్పుకుంటున్న యువ రాణి ఒకసారి ఆకాశంలోకి చూసింది. అంతలోనే గ్రద్ద తన్నుకుపోతున్న గొర్రెల మూటవచ్చి రాణి కంట్లో పడింది. రాణి సుతారంగా తన కంటిరెప్పను ఒక్కసారి రుద్దింది. వెంటనే గొర్రెల మూట కరిగిపోయింది.

కథనంతా విన్నారు కదా ! మరి మీరే చెప్పండి వీరిలో ఎవరు గొప్పో.??

# చుక్కల కోసం రెక్కలు

*ఆకాశంలో నక్షత్రాల్ని చూస్తే ఏమనిపిస్తుంది? కోసుకో బుద్ధవ్వదూ? రాముకీ అలాగే అనిపించింది. మరి వాడు ఏం చేశాడో చూడండి మరి.*

*రచన: నారాయణ*

రాత్రిపూట ఆకాశంలో చంద్రుడు ఒక ప్రక్కన వెన్నెల వెలుగులు కురిపిస్తున్నాడు. రెండో వైపున చుక్కలు మెరుస్తున్నాయి. రాముకిప్పుడు మూడేళ్లు. మంచం మీద పడుకుని ఆకాశాన్ని చూస్తుంటే నక్షత్రాల పువ్వులు అన్నీ కళ్లముందు పరచుకొని కనిపిస్తున్నాయి. కొన్ని నక్షత్రాల్ని కోసుకుంటే బాగుండుననిపిస్తోంది. తన జేబులో ఎన్ని నక్షత్రాలు పడతాయి? ఒకటి, రెండు, మూడు,.. పది..ఇరవై వరకు పట్టవచ్చేమో. తనొక ఇరవై నక్షత్రాలు కోసుకొని వస్తే బాగుండు. ఈ ఆకాశపు చెట్లో చాలా నక్షత్రాలున్నై, పరవాలేదు. వెళ్ళి కోసుకుంటే సరి. పోనీలే, ఒక రెండు నక్షత్రాలు తెస్తే చాలులే. ఊరికే వాడిపోతే ఏమి లాభం? సమస్యల్లా ఒక్కటే- ఎలా వెళ్ళాలి అనేదే.

రాముకి చెవిలో జుయ్ అని శబ్దం వినబడింది. దోమ. వెంటనే రాముకు ఒక ఆలోచన వచ్చింది.

"దోమా, దోమా, నీ రెక్కలిస్తావా నాకు కొంచెం సేపు? ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లి రెండు నక్షత్రాలు కోసుకొస్తాను?" అడిగాడు రాము.

"అమ్మో! నేనివ్వను. అయినా నా రెక్కలు నీకు సరిపోవు. తూనీగ రెక్కలు బాగుంటాయి. అది నీకిస్తుందేమో మరి. అడిగిచూడు" అని రాముని కుట్టింది దోమ.

రాము దోమను తరిమి, తూనీగ దగ్గరకు వెళ్లాడు. మామూలుగా అటూ ఇటూ ఆగకుండా ఎగిరే తూనీగ ఇప్పుడు చెట్టు రెమ్మ మీద కూర్చుని నిద్రపోతున్నది. "దోమనడిగితే రెక్కలివ్వనంది. తూనీగా తూనీగా, నీ రెక్కలిస్తావా నాకు కొంచెం సేపు? ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లి రెండు నక్షత్రాలు కోసుకొస్తాను?" అడిగాడు రాము.

"సరే, తీసుకో. కానీ అవి నీకు సరిపోతాయో సరిపోవో. నీ శరీరం చాలా పెద్దదిగదా" అన్నది తూనీగ.

"చూద్దాం" అని, తూనీగ రెక్కలు పెట్టుకున్నాడు రాము. కానీ చాలా వేగంగా రెపరెపలాడే ఆ చిన్న రెక్కలు రాము బరువును లేపలేకపోయాయి. తూనీగ అన్నది- "ఇవి చాలా చిన్నవి కదా, పిచ్చుక రెక్కలైతే సరిపోతాయి నీకు. అడిగిచూడు" అని.

"సరే" అని, రాము తూనీగ రెక్కలు వెనక్కి ఇచ్చి, పిచ్చుక దగ్గరకు వెళ్లాడు. "దోమ రెక్కలు ఇవ్వనంది. తూనీగ రెక్కలు చాలవంది. తూనీగా తూనీగా, నీ రెక్కలిస్తావా నాకు కొంచెం సేపు? ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లి రెండు నక్షత్రాలు కోసుకొస్తాను?"

"సరే, చూడు" అంది పిచ్చుక. "కానీ ఇవికూడా సరిపోవేమో"

"చూద్దాం" అని పిచ్చుక రెక్కలు పెట్టుకున్నాడు రాము. కానీ ఆ బుల్లి రెక్కలు రాము బరువును లేపలేదు.

"నేను నీకు ముందే చెప్పానుకదా, కాకిని అడిగిచూడు" అంది పిచ్చుక.

"దోమ రెక్కలు ఇవ్వనంది. తూనీగ రెక్కలు చాలలేదు. పిచ్చుక రెక్కలు సరిపోలేదు. కాకీ కాకీ, నీ రెక్కలిస్తావా నాకు కొంచెం సేపు? ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లి రెండు నక్షత్రాలు కోసుకొస్తాను?" అడిగాడు రాము, కాకి దగ్గరకెళ్లి.

"సరే, తీసుకో" అంది కాకి. కానీ ఆ రెక్కలు పెట్టుకుంటే రాము కోడిలాగా కొంచెం కొంచెం పైకి ఎగరగలిగాడు తప్ప, ఆకాశంలోకైతే పోలేదు.

కాకి అన్నది, "ఇవి నీకు నప్పలేదు. గద్ద రెక్కలు సరిపోతాయేమో, అడిగిచూడు."

"దోమ వినలేదు. తూనీగ రెక్కలు చాలలేదు. పిచ్చుక రెక్కలు సరిపోలేదు. కాకి రెక్కలు నప్పలేదు. గద్దా గద్దా, నీ రెక్కలిస్తావా నాకు కొంచెం సేపు? ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లి రెండు నక్షత్రాలు కోసుకొస్తాను?" రాము అడిగాడు గద్దని.

"సరే తీసుకో అంది గద్ద. కానీ నేనే ఎప్పుడు నక్షత్రాలు కోసుకు రాలేదు. నా రెక్కలు అంత ఎత్తుకు పోతాయంటే సంతోషమే." రాము గద్ద రెక్కలు పెట్టుకొని శ్రమపడి ఎగిరాడు, కానీ చిన్న చిన్న చెట్లంత ఎత్తుకే ఎగరగల్గాడు.

"వీటికంటే గండభేరుండ పక్షి రెక్కలైతే మేలు. అడిగి చూడు" అంది గద్ద.

"సరే" అని రాము గండభేరుండ పక్షి కోసం వెతకటం మొదలు పెట్టాడు. చాలా సేపు వెతికిన తర్వాత గానీ గండభేరుండం దొరకలేదు. అప్పటికి తెల్లవారుతున్నది. నక్షత్రాలు మాయమయ్యాయి.

గండభేరుండం అంతా విని అన్నది, "అయ్యో, నేను సాయంత్రంకల్లా హిమాలయాలకు వెళ్ళాలి కదా, వచ్చాక ఇస్తాలే నీకు నారెక్కలు. అప్పటివరకు ఈ కలలు నీదగ్గర ఉంచుకో. ఈ కలల్లో ఎక్కి నువ్వు ఎక్కడికైనా వెళ్ళి రావచ్చు. ఎక్కువ సమయం కూడా పట్టదు." అని చాలా కలలు ఇచ్చి వెళ్లింది. కానీ ఏమైందో ఏమో, అది ఈనాటికీ తిరిగిరాలేదు.

రాము మాత్రం రోజూ ఆ కలలెక్కి అన్ని నక్షత్రాలూ తిరిగి వస్తున్నాడు. మీకూ కావాలా కొన్ని కలలు? మా దగ్గర చాలానే ఉన్నై, కావాలంటే అడగండి మరి!

# సముద్ర తీరం

*సముద్రతీరం పోవటం చాలా మంది పిల్లలకు వినూత్న అనుభవం. మనదేశానికి అంత పొడవు తీరరేఖ ఉన్నా, ఆ రేఖకు కడు దూరంగా ఉన్న ప్రాంతాల్లోని లక్షలాది మందికి తమ జీవితంలో ఒక్కసారికూడా సాగరుడిని చూసే అవకాశం ఉండదు. చెన్నే కొత్తపల్లి పిల్లల్లోకూడా, నిజానికి, నూటికి 99 మందికి ఈ భాగ్యం కలగలేదు- అయినా పాడుతున్నారు ముచ్చటగా- చిలుక పలుకులు!*

*రచన: కీ. శే. కవికాకి జై సీతారాం*

*గానం: సమర, రాశి- నాలుగో తరగతి, ప్రకృతి బడి, చెన్నే కొత్తపల్లి*

సముద్ర తీరం పోతిమి, చాల సేపు చూస్తిమి
సూర్యుడెంతో గుండ్రముగా చల్లని వెన్నెల కాయగా
అలలు చక్కగ దొర్లుతూ, అవసరముగ పొర్లుచూ
నిలిచిఉన్న మాపైన,నీళ్ళు ఎత్తి చల్లెను
కొత్త పావడా తడిసెను, ఎత్తి పట్టి నడిచాను
అంతలోన గవ్వలు, ఎంతో తెల్లగ వచ్చెను
జవర పట్ట బోతిమి, అన్నీ జారిపోయెను



# అద్దంలో ఎవరమ్మా

*చిన్న చిన్న ఊహల్ని సున్నితంగా అడగటం బాల్యపు ప్రాథమిక లక్షణమేమో. కవికాకి జై సీతారాం చనిపోయేవరకూ చిన్న పిల్లవాడుగానే ఉన్నట్లు తోస్తుంది, ఈ రెండు లైన్ల పాటని వింటే.*

*రచన: కీ.శే.కవికాకి జైసీతారాం*
*గానం: రాశి, నాలుగో తరగతి, ప్రకృతిబడి, చెన్నే కొత్తపల్లి.*

అద్దంలొ ఎవరమ్మా,
ముద్దుమొగం బొమ్మ!
నేనెట్ల దువ్వితే తానట్ల దువ్వు
నేనెట్ల నవ్వితే తానట్లె నవ్వు



# చెట్టుమీదినుండి కాకి

*నిజంగా చదువురాని వారి బ్రతుకు అంత ఘోరంగా ఉంటుందో ఉండదో గాని మన సమాజం మాత్రం ప్రస్తుతం వారిని ఇలా ఛీకొట్టే దశలో ఉన్న దనటం మాత్రం వాస్తవం. ఈ పాట అంతం మాకు నచ్చలేదు- అయినా చర్చ జరిపే ఉద్దేశంతో, ఐదోతరగతిలో చేరిన కొత్తపిల్లవాడు రాజు పాడిన ఈ పాటను మీ ముందుకు తెస్తున్నాం. మీకేమనిపించిందో రాయండి.*

*గానం: రాజు బృందం, ఐదవ తరగతి, ప్రకృతిబడి, చెన్నే కొత్తపల్లి.*




చెట్టు మీద నుండి కాకి కావ్ కావ్ కావ్
కొమ్మమీది కోయిలమ్మ కూ కూ కూ "2"

చూరుమీద పిచ్చుకమ్మ చిక్ చిక్ చిక్
చిగురుచాటు రామచిలుక రామ్ రామ్ రామ్ "2"

బాటలోని కుక్కపిల్ల భౌ భౌ భౌ
ఉట్టిమీద పిల్లిపిల్ల మ్యావ్ మ్యావ్ మ్యావ్ "2"

ఊయలలొ బుల్లిపాప క్యావ్ క్యావ్ క్యావ్
ఊయలూపు తల్లిపాట జో జో జో "2"


గోడమీది గడియారం టిక్ టిక్ టిక్
రోడ్డు మీది కారు మోత పామ్ పామ్ పామ్ "2"

చదువుకున్న వారి బతుకు హాయ్ హాయ్ హాయ్
చదువురాని మొద్దు బ్రతుకు ఛీ ఛీ ఛీ

# ఎంతో మంది పనివాళ్లు

*మన గ్రామీణ సమాజం మనుగడ వృత్తిపనివారిపై ఆధారపడి ఉన్న ది, ఈ నాటికీ. అయితే పట్నాల్లో పిల్లలకు మాత్రం అసలు వీరు ఎవరో కూడా తెలీటం లేదు ఈ కాలంలో. మారుతున్న సమాజపు విలువల్లో మనుషులు పోయి, యంత్రాలు చేరుకుంటున్నా యి. వృత్తిపనివారిని మనందరికీ గుర్తుచేసే ఈ పాటను వినండి, కొంచెం ఆలోచించండి.*

*గానం: వరలక్ష్మి, మూడో తరగతి, ప్రకృతి బడి, చెన్నే కొత్తపల్లి*




ఎంతో మంది పనివాళ్ళు, అంతామంచి పనివాళ్ళు
మడకను దున్నే మాదన్న, కొడవలి పట్టిన కొండమ్మ
||ఎంతోమంది||

గుడ్డలు నేసే గురవయ్య, బట్టలు ఉతికే బాలన్న
||ఎంతోమంది||

కుండలు చేసే కొమరయ్య, కొలిమిని ఊదే కోనయ్య
||ఎంతోమంది||

చెప్పులు కుట్టే చెన్నయ్య, దుస్తులు కుట్టే మస్తాను
||ఎంతోమంది||


చదువును నేర్పే సాంబయ్య, యంత్రం నడిపే యేసయ్య
||ఎంతోమంది||

పని వాళ్ళంతా సమానమే అని చెప్పేదే మన సమాజము
||ఎంతోమంది||

# కనుక్కో కనుక్కో

*తెలుగునాట పొడుపుకథలు చాలా ఉన్నై, రకరకాల రూపాల్లో. వీటిలో చదువుకునేవాటికంటే, పాటలుగా వినవచ్చినవి ఎక్కువకాలం నిలిచాయి కూడా. ఇక్కడ వినవస్తున్న పొడుపుకథ పాట ఒకటి, మీకోసం.*

*గానం: చంద్ర, రెడ్డి, సయ్యద్ ప్రకృతిబడి, చెన్నే కొత్తపల్లి.*




కనుక్కో కనుక్కో ఓ బాలా
పొడుపుకథా చెబుతాను

కథ విప్పండీ-
కథ చెప్పండీ-

చూడచక్కని చిన్నది, గోడమీద ఉన్నది
నువ్వుచూస్తే నీలాగ, నేనుచూస్తే నాలాగ
ఏమిటది ? ఏమిటది ? ఏమిటది-

అద్దం!!

ఆవును గుంజకు కట్టేసి దూడ మేతకు వెళ్ళింది.
సాయంకాలం తిరిగొచ్చి ఆవుకు బంధం విప్పింది.
ఏమిటది ? ఏమిటది ? ఏమిటది-

తాళంచెవి!.

అమ్మకడుపులో నిద్రిస్తారు అరవైమంది పిల్లలు
మేలుకున్న పిల్లవాడు కాలిపోతాడు
ఏమిటది ? ఏమిటది ? ఏమిటది-

అగ్గిపుల్ల!

పొద్దున్నే జననం, రాత్రంతా శయనం
సాయంకాలం పయనం
ఏమిటది ? ఏమిటది ? ఏమిటది-

సూర్యుడు!

నల్లని ముఖమూ, నలచదరం
పిల్లలు పెట్టే తెల్లని వాతలు
ఏమిటది ? ఏమిటది ? ఏమిటది-

పలక!

ఒంటి చేతి పిల్లా, వడ్డించు మల్లా
ఏమిటది ? ఏమిటది ? ఏమిటది-

గరిటె!

కవలపిల్లలిద్దరు, కాళ్ళకింద ఉందురు
ఒకరిని విడచి ఉండరు, ఒంటరిగా నడవరు.
ఏమిటది ? ఏమిటది ? ఏమిటది-

చెప్పులు!

# కాకమ్మ నలుపు

*రచన: కీ.శే. కవికాకి జై సీతారాం*

*గానం: రాశి, రియాజ్, మూడో తరగతి, ప్రకృతి బడి*

కాకమ్మ నలుపు, కారు మబ్బు నలుపు
కొంగమ్మ తెలుపు, కోడిగుడ్డు తెలుపు
చిలకమ్మ పచ్చన, చెట్లన్ని పచ్చన
దానిమ్మ ఎరుపు, తాంబూలం ఎరుపు
పండు నిమ్మ పసుపు, బంగారంపసుపు.

# మాదే ఈ తరం

*గానం: భారతి, శారద, తొమ్మిదో తరగతి, ప్రకృతి బడి, చెన్నే కొత్తపల్లి, అనంతపురం జిల్లా.*

మాదే ఈ తరం వందేమాతరం,
మాదేఈతరం వందేమాతరం
జైహిందను జైహిందను మానినాదం
మా ఐకమత్యమే మా ప్రబోధం

వీరులం విధాతలం విశాల హృదయులం
వీరులం విధేయులం వివేకవంతులం ||వీరులం||

ఎత్తుకెదిగెవరకూ హద్దులేనెలేదు
ఒక్కటేలె శ్వాస, రేపుమీద ధ్యాస
ఏదేశమూ బాల సంక్షేమము
సాధించునో అదే ప్రగతి గాంచును ||మాదే ఈతరం||

శూరులం, వినూత్నులం విరత్నకాంతులం
పిల్లలం పునీతులం ప్రధాన పాత్రులం ||శూరులం||

చేతకానిదేలేదు చెయ్యలేనిదేలేదు
చేతకానిదేలేదు చెయ్యలేనిదేలేదు
మాబాలలే మీకు ఆదర్శము
మాబాటలో మిమ్ము నడువమందుము ||మాదే ఈతరం||




# పిల్లి పిల్లి ఏమంటావ్

*రచన: కే.శే. కవికాకి జైసీతారాం ప్రచురణ: "మేం పిల్లలం" టింబక్టు కలెక్టివ్ గానం: జ్యోతి, శిరీష, నాలుగో తరగతి, ప్రకృతిబడి, చెన్నే కొత్తపల్లి, అనంతపురం జిల్లా.*

పిల్లీపిల్లీ ఏమంటావ్ - మ్యావ్ మ్యావ్ మ్యావ్
కాకికాకి ఏమంటావ్ - కావ్ కావ్ కావ్
కుక్కాకుక్కాఏమంటావ్ - భౌ భౌ భౌ
ఆవు ఆవు ఏమంటావ్ - అంబా అంబా అంబా
కోడిపుంజూ కోడిపుంజూ ఏమంటావ్ - కొక్కొరొక్కొకొక్కొరొక్కొ
కోకిలమ్మ కొకిలమ్మ ఏమంటావ్ - కుహు కుహు కుహు
మేక మేక ఏమటావ్ - మే మే మే
గొర్రె గొర్రె ఏమంటావ్ - బే బే బే
బాతు బాతు ఏమటావ్ - బెక్ బెక్ బెక్
కప్పా కప్పా ఏమటావ్ - బెక బెక బెక బెక
పామూ పామూ ఏమంటావ్ - బుస్ బుస్ బుస్.



# సంబరాలు సంబరాలు

*కొత్తపంటలు వచ్చాక పాత పంటలు పోయాయి. కొర్రలు, సామలు, ఆరికెలు, రాగులు, జొన్నలు, సజ్జలు ఇంకా మరెన్నో తృణధాన్యాలు మన రాష్ట్రం నిండా పల్లె పల్లెల్లో సునాయాసంగా పండేవి. ఒకసారి మనమందరం బియ్యానికి అలవాటు పడిన తరువాత వీటన్నిటికీ ఆదరణ కరువైంది. ఇప్పుడు, పట్నపుకష్ట జీవితాల్లో చక్కెరవ్యాధులు, గుండెపోట్లు అధికమైన తరువాత కొద్ది కొద్దిగా వీటికున్న వ్యాధి నిరోధక లక్షణాలు చర్చలోకి రావటం మొదలైంది మళ్ళీ. ఈ నేపథ్యంలో పాతపంటల్ని సంబరంగా గుర్తుచేసుకునే ఈ పాట, మీకోసం.*

*గానం: రోజా, ఎనిమిదో తరగతి, ప్రకృతిబడి, చెన్నే కొత్తపల్లి.*



సంబరాలు సంబరాలు ఎన్నియల్లో, మరి పాతా పంటా ఎన్నియల్లో
సంబరాలు, సంబరాలు, సంబరాలు, సంబరాలు హో !

పొద్దుగాలె పోతున్నాము ఎన్నియలో, మరి సామ బువ్వ ఎన్నియలో
సంబరాలు, సంబరాలు, సంబరాలు, సంబరాలు హో ! ||సంబరాలు||

పగటి భోజనం ఎన్నియలో, మరి కొర్రాబువ్వా ఎన్నియలో
సంబరాలు, సంబరాలు, సంబరాలు, సంబరాలు హో ! ||సంబరాలు||

రాత్రి భోజనం ఎన్నియలో, మరి సజ్జ రొట్టె ఎన్నియలో
సంబరాలు, సంబరాలు, సంబరాలు, సంబరాలు హో ! ||సంబరాలు||

పొద్దు గాలె పోతున్నాము ఎన్నియలో, మరి రాగి ముద్దా ఎన్నియలో
సంబరాలు, సంబరాలు, సంబరాలు, సంబరాలు హో ! ||సంబరాలు||

# కుసుమా కుసుమా

*చిన్న పిల్లలు కోరుకునే సున్నితత్వం ఈ నాలుగు పలుకుల్లో అందుతుంది. అందుకోండి.*

*గానం: శిరీష బృందం, నాలుగో తరగతి, ప్రకృతిబడి, చెన్నే కొత్తపల్లి.*



కుసుమా కుసుమా
ఎండలో కూర్చున్నావ్
లే, లే పాపా!
కంటి నీళ్ళు తుడుచుకో,
కాళ్ల ముళ్ళు తీసుకో,
ఎవరు కావాలో కోరుకో.

# సమస్యలు

*సమస్యలు, పొడుపుకథలు మన మేధస్సుకు పదును పెడతాయి. పదవతరగతి పావని అడుగుతున్న ఈ సమస్యల్ని, గంగమ్మక్క అడుగుతున్న ఈ పొడుపుకథల్ని సొంతంగా సాధించగలరేమో ప్రయత్నించండి. వీలుకాకపోతే, మరేం చేస్తాం, జవాబుల్ని క్రిందే ఇచ్చాం, చూసి అర్థం చేసుకోగలరేమో ప్రయత్నించండి. రెండు రకాలుగానూ ప్రయత్నం మాత్రం అవసరమే మరి. విజయోస్తు!*

**సమస్యలు**

1. ఒకతను ఒక మేకనూ, ఒక పులినీ, ఒక ఆకుల కట్టనూ తీసుకొని దారి వెంట వెళుతుండగా ఒక నది అడ్డంవచ్చింది. నదిని దాటడానికి అక్కడ ఒక్క పడవ మాత్రమే ఉన్నది. అందులో, అతనూ, ఇతర వస్తువు ఏదయినా ఒకటి మాత్రమే అవతలికి తీసుక వెళ్ళడానికి వీలవుతుంది. అయన లేకపోతే, మేకేమో, ఆకులకట్టను తింటుంది. పులేమో, మేకను తింటుంది. మరి ఆ మూడింటినీ ఎలా అవతలికి చేర్చుతాడో చెప్పుకోండి.

2. సంధ్య, వీణ అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. సంధ్య వాళ్ళ ఇంటికి బంధువులు వచ్చారు. సంధ్యకు నాలుగు లీటర్ల పాలు కావాలి. వాళ్ళింట్లో మూడులీటర్లు పట్టే పాత్ర మాత్రమే ఉన్నది. అపుడు సంధ్య వీణ వాళ్ళ ఇంటికి పోయి 'నాలుగు లీటర్లు పట్టే పాత్ర' ఉన్నదా ? అని అడిగింది.''నాకూ నాలుగు లీటర్ల పాలు కావాలి. కానీ మాఇంట్లో కూడా ఐదు, ఎనిమిది లీటర్లు పట్టేపాత్రలే ఉన్నాయి, పద ఇద్దరంపోయి ఎనిమిది లీటర్ల పాత్రలోకి పాలు తెచ్చుకొందామ'ని, వెళ్ళారు. తిరిగొచ్చి, వారిద్దరూ ఆ పాలను ఎలా పంచుకుంటారు ?

**పొడుపు కథలు**

1.
అమ్మలో జమ్మలో పుడితివాకొడకా !
అరచేతి పట్నానికి వస్తివా కొడకా !
గోరంత తిరునాళలో వస్తివా కొడకా !
ఇంతకీ నువ్వెవరు ఓ కొడకా?

2.
గజిబిజ నీళ్ళలో శ్రీరాముడు పుట్టె
శ్రీరాముని కడుపులో వైరాముడుపుట్టె
వైరాముని కడుపులో వజ్రము పుట్టె.
ఎవరది, చెప్పండి?

3.
ఆదోని అరిటాకు
బళ్ళారి బాణకట్టె
గుత్తి ముత్యాల చెండు.
ఏమిటా మూడూ?

**జవాబులు:**

మొదటి సమస్య:

అతను ముందుగా మేకను తీసుకవెళ్ళి, దాన్ని అవతలి ఒడ్డుకు చేర్చి, వెనక్కి వస్తాడు. తరువాత ఆకుల కట్టను తీసుక పోయి, దాన్ని అక్కడ ఉంచి, మేకను వెనక్కి తీసుక వస్తాడు. ఈసారి మేకను ఇవతలి ఒడ్డునే ఉంచి, పులిని అవతలి ఒడ్డుకు తీసుకపోతాడు. తర్వాత వచ్చి, పులిని అవతలి ఒడ్డుకు తీసుకపోతాడు.

రెండవసమస్య:

మొదట మూడు లీటర్ల పాత్ర నిండా పాలను పోశారు. ఆ మూడు లీటర్లనూ, ఐదు లీటర్ల పాత్రలోకి మార్చారు. ఇపుడు మూడు లీటర్ల పాత్ర ఖాళీగా ఉన్నది. ఎనిమిది లీటర్ల పాత్రలో, ఐదు లీటర్ల పాలుమాత్రమే ఉన్నాయి. ఇప్పుడు ఆపాలను మూడు లీటర్ల పాత్ర నిండా పోశారు. ఇపుడు ఎనిమిది లీటర్ల పాత్రలో రెండు లీటర్ల పాలుమాత్రమే మిగిలున్నాయి. ఇపుడు మూడు లీటర్ల పాత్రలోని పాలను, తిరిగి ఐదులీతర్ల పాత్రలోనికి పోశారు. ఇంతకుముందే పోసిన మూడు,లీటర్ల పాలున్న కారణంగా, ఇప్పుడు అందులోకి రెండు లీటర్ల పాలుమాత్రమే పట్టాయి. మిగిలిన ఒక్క లీటరు పాలు మూడు లీటర్ల పాత్రలో ఉన్నాయి. ఐదు లీటర్ల పాత్రలోని పాలను , తిరిగి ఎనిమిది లీటర్ల పాత్రలోకి పోశారు. మూడులీటర్ల పాత్రలోని పాలను ఐదు లీటర్ల పాత్రలోకి మార్చారు. మూడు లీటర్ల పాత్రలోకి ఎనిమిదిలీటర్ల పాత్రలోనుంచి పాలు పోశారు. మూడు లీటర్ల పాలను ఐదు లీటర్ల పాత్రలోకి పోశారు. ఐదు లీటర్ల పాత్రలో ముందుగా ఒక లీటరు పాలు ఉంటాయి. ఇప్పుడు మూడు లీటర్ల పాలను పోశారు. ఐదు లీటర్ల పాత్రలో నాలుగు లీటర్లు, ఎనిమిది లీటర్ల పాత్రలో నాలుగు లీటర్ల పాలున్నాయి. భలే సులభంగా ఉన్నది కదా ! జవాబు.

మొదటి పొడుపుకథకు జవాబు: పేను

రెండవ పొడుపుకథకు జవాబు: వరి

మూడవ పొడుపుకథకు జవాబు: జొన్నఆకు, జొన్న దంటు, కంకి.